అతిసార నివారణే లక్ష్యంగా..

- వ్యాధి నియంత్రణ పక్షోత్సవాలు
- క్షేత్ర స్థాయిలో ఆరోగ్య కార్యకర్తల పర్యటన
- ఈ నెల 17 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు
- అందుబాటులోకి ఓఆర్ఎస్, జింక్ డోస్‌లు


పడమరఖండ్రికలో ఓఆర్ఎస్ ద్రావకం తయారీ, వాడకంపై ప్రయోగాత్మకంగా చూపుతున్న ఆరోగ్య కార్యకర్త

కపిలేశ్వరపురం: వర్షాకాలం ప్రారంభ రోజుల్లో అతిసార (విరేచనాలు) ఉధృతమయ్యే అవకాశాలు సహజంగా ఉంటాయి. అతి సాధారణమైన వ్యాధిగానే కనిపించినప్పటికీ, నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదమవుతుంది. ఇది కేవలం ఒక వ్యక్తి తీసుకునే జాగ్రత్తలతో నియంత్రించగలిగేది కాదు. సామూహిక ప్రయత్నం ద్వారా వ్యాధిని అరికట్టాల్సిందే. అందుకే ప్రభుత్వం అతిసార మరణాలు అరికట్టడమే లక్ష్యంగా 15 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. ఈనెల 5న రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.16 పీహెచ్‌సీల వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించడం, వైద్య ఆరోగ్య అనుబంధ శాఖల సహకారంతో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.అతిసార సోకినవారిని రక్షించేందుకు ఓఆర్ఎస్, జింక్ తదితర ఔషధాలను సిద్ధం చేశారు. వ్యాధి నియంత్రణకు చేపట్టిన పక్షోత్సవాల ప్రత్యేక కార్యకలాపాలపై ఈ కథనం...

అతిసార సోకుతుంది ఇలా...

అతిసార వ్యాధి విబ్రియో కామా, విబ్రియో కలరా అనే బ్యాక్టీరియా ఆశించడం మనుషులకు ద్వారా వస్తుంది. కలుషితమైన ఆహారపదార్థాలు, నీరు తాగడం, శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం, పరిసరాలు అపరిశుభ్రం ఉండటం, తల్లి పరిశుభ్రంగా లేకపోవడం, తల్లిపాలు లోపించడం ద్వారా పిల్లలకు అతిసార సోకుతుంది.

కార్యక్రమాల వివరాలు

అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ఈనెల 5 నుంచి 17 వరకూ నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు జారీ చేశారు. అందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను సైతం నిర్దేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఓఆర్ఎస్, జింక్ డోస్‌లను సులభంగా అందుబాటులోకి తెచ్చి డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా చూడాలని ఆదేశించారు. ఒకవేళ డీహైడ్రేషన్‌కు గురైతే ఆరోగ్యానికి హాని కలగకుండా కాపాడటంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించనున్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను, ఇతర తాగునీటి వనరులను పరిశుభ్రం చేస్తారు. గత రెండేళ్లలో డయేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

రెండు నియోజకవర్గాల్లో సేవలు

నియోజకవర్గం	మొత్తం పీహెచ్‌సీలు	వైద్యులు	స్టాఫ్ నర్సులు	ఫార్మాసిస్టులు
మండపేట	07	15	15	05
రామచంద్రపురం	09	15	23	09
మొత్తం	16	30	38	14

తల్లిపాలు శ్రేష్టం



అతిసారకు చిన్నారులు అధికంగా గురవుతుంటారు. మొదటి ఆరు నెలలు వారికి కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలి. విరేచనాలు అవుతున్నపుడు తల్లిపాలు, ఇతర ద్రావణాలను, అనుబంధ ఆహారాన్ని నిర్విరామంగా ఇవ్వాలి. బిడ్డకు ఆహారం తినిపించే ముందు, వంట చేయడానికి ముందు, బిడ్డ మలమూత్ర విసర్జకాలను తీసినపుడు చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలి. విరేచనాల సమయంలో బిడ్డకు ఆరోగ్య సిబ్బంది సూచనలు మేరకు ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు నిర్దేశించిన మోతాదులో జింక్ మాత్రలు 14 రోజుల పాటు ఇవ్వాలి.

–డాక్టర్ జి.అనూజ ప్రియాంక, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం

మాచరమట్టలులో తాటాకిల్లు దగ్ధం


కాలిపోతున్న ఇల్లు

కపిలేశ్వరపురం: మాచర గ్రామ శివారు మాచరమట్టలు గ్రామంలోని సంతకాడి గోపీకృష్ణకు చెందిన తాటాకిల్లు సోమవారం దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్టు తెలిసింది. సమాచారం అందిన వెంటనే రామచంద్రపురం అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలోని సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంటితో పాటు నగదు, విద్యుత్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయని, రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్టు నమోదు చేశామని ఫైర్ అధికారి తెలిపారు.

నేడు రాయవరంలో గడప గడపకూ..

రాయవరం: రాయవరంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

క్లుప్తంగా

రామారెడ్డి కుటుంబానికి చైర్‌పర్సన్ పరామర్శ

మండపేట: పట్టణానికి చెందిన ధాన్యం కమీషన్ వ్యాపారి గొలుగూరి కోదండ వెంకట రామారెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పరామర్శించారు. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన రామారెడ్డి ఇటీవల దారుణ హత్యకు గురైన విషయం విదితమే. బ్యాంకు కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి భార్య శ్వేతనాగదేవి, కుటుంబ సభ్యులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మిలను చైర్‌పర్సన్ దుర్గారాణి కలిసి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, కొవ్వాడ బేబి, గ్రంధి శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

ఆలయం భారతీయ సంస్కృతికి నిలయం


కేదారిలంక యాగశాలలో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: ఆలయం భారతీయ సంస్కృతికి నిలయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో సోమవారం నిర్వహించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠకు విశేష కృషి చేసిన పేపకాయల సూరిబాబు, చంద్రావతి దంపతులు అతిథులకు స్వాగతం పలికారు. వీధి గంగాధర్, చిట్టితల్లి దంపతులు పీటలపై పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్నవారిలో సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కార్యదర్శి పోలిశెట్టి గణేష్ ఉన్నారు.

గొల్లాలమ్మ ఆలయానికి శంకుస్థాపన

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడు గ్రామంలో దాతలు గుండపునీడి వీర్రాఘవ, వీరాయమ్మ దంపతులు ఇచ్చిన నాలుగు సెంట్ల స్థలంలో సోమవారం దాతల చేతుల మీదుగా శ్రీ గొల్లాలమ్మ అమ్మవారి ఆలయానికి శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, గ్రామ సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి, వీర్రాజు దంపతులు, కమిటీ సభ్యులు బిక్కిన వెంకటసుబ్బారావు, ఉండవిల్లి రామకృష్ణ, కోట త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ రాయుడు సుబ్బన్న, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రాయవరం: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన గంధం శ్రీసత్య అనే వివాహిత అదృశ్యమైంది. స్థానిక ఎస్సై పీవీవీఎస్ఎన్ కథనం ప్రకారం, ఈ నెల 10వ తేదీ ఉదయం 9–10 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల వెదికినప్పటికీ ఆమె ఆచూకీ తెలియక పోవడంతో భర్త సతీష్ రాయవరం పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరుపక్షాలపై కేసుల నమోదు

రాయవరం: పసలపూడి ఊటలంక వీధిలో ఇరుపక్షాలు దాడులు చేసుకున్న ఘటనపై సోమవారం కేసులు నమోదు చేసినట్టు రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఊటలంకవీధికి చెందిన వెంకయ్యరమణ, అదే ప్రాంతానికి చెందిన ఇసుకపల్లి మహేష్ కుటుంబాలకు మధ్య పాత గొడవలున్నాయి. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇరుపక్షాల వారు గొడవ పెట్టుకున్నారు. ఈ ఘటనలో ఇరుపక్షాల వారికి గాయాలు కాగా, రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంపై ఇరుపక్షాల వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

డ్రైనేజీలో పూడికతీత పనులు

ఆలమూరు: వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగి పొర్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలోని చెముడులంకలో మేజర్ డ్రైన్‌లో సోమవారం పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు ఈ డ్రైన్ పూడికతీత పనులు చేపట్టారు. మురుగునీరు ఎప్పటికప్పుడు బయటకు పోయే విధంగా గ్రామస్తులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే వర్షాకాలం సీజన్ దృష్ట్యా అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా అనునిత్యం పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి యు.రేణుక, మాజీ సర్పంచ్ బుద్ధిగ వీర వెంకట్రావు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన డంపింగ్‌యార్డు సమస్య

- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ తోట
- త్వరలో టిడ్కో ప్లాట్లు ఇస్తామని వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


సమావేశంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: దశాబ్దాలుగా పట్టణాన్ని పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్య కొలిక్కి వచ్చినట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. స్థల సేకరణకు అడ్డంకులు తొలగి పోయాయని, త్వరలో ఆ ప్రక్రియ పూర్తి కానుందన్నారు. అలాగే రెండో విడత టిడ్కో ప్లాట్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన సోమవారం స్థానిక కౌన్సిల్ హాల్లో జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. రూ. 3.34 కోట్లతో స్థలసేకరణ చేసేందుకు అజెండాలో పేర్కొన్న అంశానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ప్రస్తుత డంపింగ్ యార్డును ఆనుకుని ఉన్న 2.75 ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు 2011లో మున్సిపాల్టీ రూ. 64 లక్షలు రెవెన్యూ శాఖకు జమ చేసిందన్నారు. అప్పటి మార్కెట్ విలువ మేరకు 2015లో మరో రూ.56 లక్షలు డిపాజిట్ చేసిందన్నారు. అయితే స్థల సేకరణకు వ్యతిరేకంగా స్థల యజమాని కోర్టును ఆశ్రయించి స్టే తీసుకు రావడంతో స్థల సేకరణ నిలిచిపోయిందన్నారు. స్థల యజమానితో మాట్లాడి స్టే ఉపసంహరింప చేయించామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత మార్కెట్ విలువ మేరకు రూ.3.34 కోట్లు చెల్లించేందుకు కలెక్టర్ నుంచి అనుమతి మంజూరు చేశారన్నారు. ఇప్పటికే ఆర్డీఓకు జమ చేసిన రూ. 1.2 కోట్లు పోను మిగిలిన రూ. 2.14 కోట్లు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రెండో విడత టిడ్కో ప్లాట్లను లబ్ధిదారులకు ఎప్పుడు అప్పగిస్తారని ఎమ్మెల్యే వేగుళ్ల అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్సీ తోట స్పందించారు. ఆగస్టు నాటికి రాష్ట్రంలో 1.5 లక్షల ప్లాట్లు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ప్లాట్లు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


స్వామివారిని దర్శించుకున్న మంత్రి వేణు తదితరులు

కె.గంగవరం: మండల పరిధిలోని తాళ్లపోడులో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి, లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయం వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 14వ తేదీన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంపీపీ పంపన నాగమణి, కో ఆప్షన్ సభ్యులు కడలి విజయదుర్గా, సర్పంచ్ చప్పిడి శ్రీనివాసు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం శ్రీరామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దాతలు దొంగల శ్రీధర్, సునీత దంపతులు, గెద్దాడ సుబ్రహ్మణ్యం, మంగాయమ్మ దంపతుల చేతుల మీదుగా దేవులపల్లి రంగారావు బ్రహ్మత్వంలో మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, డాక్టర్ పితాని అన్నవరం, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు అంబటి తుకారం, కొత్తపల్లి అరుణ, యల్లమిల్లి సతీష్ కుమారి, వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. సంఘ పెద్దలు కుడుపూడి పెద్దరాముడు, టేకుమూడి రాంబాబు, పితాని సూరిబాబు, కడియాల గోవిందు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల పురోగతి


కాజులూరులో జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేస్తున్న నాయకులు

కాజులూరు: నాడు–నేడు పథకం ద్వారా రాష్ట్రంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పురోగతి చెందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల బీసీ సంఘం నేత, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలలో నాయకులు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాజులూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యతనిస్తూ నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో వాటి రూపురేఖలే మారిపోయాయన్నారు. వసతులు సమకూరటంతోపాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రి యావత్తు కిట్ రూపంలో జగనన్న విద్యాకానుక ద్వారా అందిస్తుంటడంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. వైఎస్సార్ సీపీ తెలగా కాపు సంఘం నాయకుడు యాళ్ళ సత్తిబాబు, పలువురు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం


రాయవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో జగనన్న విద్యాకానుక పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని పసలపూడి, రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన జగనన్న విద్యా కానుక పంపిణీలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వి.శాంతి సునీత, నూలు ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ మంగతాయారు, వెంకటరమణలు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు చంద్రమళ్ల రామకృష్ణ, కడలి పద్మావతి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్లు చింతా సుబ్బారెడ్డి, తేతల సుబ్బరామారెడ్డి, బ్లడ్ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా పంచాయతీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ


పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణం వద్ద ఐటీసీ లిమిటెడ్ సహకారంతో నిర్మించే పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో వర్తకులు, దుకాణాల్లో పనిచేసే సిబ్బంది, వివిధ అవసరాల నిమిత్తం పరిసర గ్రామాల నుంచి అనపర్తి వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనపర్తి ఐటీసీ ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఐటీసీ ఫ్యాక్టరీ మేనేజర్ ఎంఎస్ సుధీర్, పర్సనల్ మేనేజర్ అబ్దుల్ వాహీద్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టడం నేరపూరిత చర్య


వల్లూరులో బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న సామాజిక కార్యకర్తలు


మండపేటలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవంలో విద్యార్థులు

కపిలేశ్వరపురం: పిల్లలను పనిలో పెట్టడం నేరపూరిత చర్య అని బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ర్యాలీలో పాల్గొన్న వక్తలు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలమూరుకు చెందిన శ్రమ, క్రై స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు ఈ నెల 7 నుంచి 12 వరకూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శ్రమ సంస్థ డైరెక్టర్ జిల్లెల్ల శేషగిరిరావు తెలిపారు. సంస్థ కో ఆర్డినేటర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వల్లూరు, అంగర, కపిలేశ్వరపురం సచివాలయాల్లో నిర్వహించిన సదస్సుల్లో బాల కార్మిక నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో బాల కార్మికులను గుర్తించి చట్ట పరిధిలో వారికి విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. సర్పంచులు దాసి మీనాకుమారి, వాసా కోటేశ్వరరావు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. చట్టం అమలుపై తగిన చర్యలు చేపట్టాలంటూ ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.

మండపేట సంఘం కాలనీలో..

మండపేట: పట్టణంలోని సంఘం కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ఘనంగా జరిగింది. పనికెందుకు తొందర.. చదువుకో ముందర అని నినదిస్తూ విద్యార్థులు కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ముత్యాల మాణిక్యాంబ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్నారు. బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా బడికి పంపడం ద్వారా వారి ఉజ్వల భవితకు బాటలు వేయాలన్నారు. ఉపాధ్యాయులు చిట్టూరి వెంకటశ్రీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం


పాణింగపల్లిలో రోడ్డు పక్కన ఉన్న చెత్తాచెదారం

కె.గంగవరం: మండల పరిధిలో పాణింగపల్లి రోడ్డు మార్జిన్లు చెత్తతో నిండిపోయి పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామ ప్రారంభంలోను, చివరిలోను రోడ్లపై చెత్త చేరి దుర్వాసన వ్యాపిస్తోంది. ఈ ప్రాంతంలో పాణింగపల్లి, అముజూరు పంచాయతీలకు చెందిన చెత్తను తరలించి ఎప్పటికప్పుడు నిప్పు పెట్టి శుభ్రం చేసేవారు. కానీ వారం రోజులుగా చెత్త వేయడం తప్ప శుభ్రం చేసే ఆలోచన చేయడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. దీనికితోడు సత్యవాడ గ్రామ పంచాయతీకి చెందిన చెత్తను కూడా అక్కడే వేస్తున్నారని పక్కనే ఇళ్లు ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చెత్త వేయకుండా చేయడంతో పాటు ఉన్న చెత్తను తొలగించే ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

46 మంది టీచర్లు బదిలీ

రంగంపేట: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలంలో వివిధ ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలల్లో పని చేస్తున్న 46 మంది ఉపాధ్యాయులు వేరే మండలాలకు బదిలీ అయినట్లు మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఇతర మండలాల నుంచి రంగంపేట మండలంలోని వివిధ పాఠశాలల్లో ఇప్పటివరకూ 17 మంది ఉపాధ్యాయులు జాయిన్ అయ్యారన్నారు. మంగళవారం నుంచి జగనన్న విద్యా కానుక కిట్లు ఆయా పాఠశాలల్లో ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తారని చెప్పారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

రాయవరం: పసలపూడిలో పరస్పర దాడుల్లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదులపై సోమవారం పరస్పర కేసులు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పసలపూడిలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల విషయమై కొద్ది రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 11వతేదీ 10 గంటల సమయంలో కుంచె కృపమ్మ ఇంటి దగ్గర్లో ఉన్న నూతి వద్ద ఉండగా, కొల్లాపు రాజేష్, గంటి గంగరాజు వర్గీయులు ఒకరిపై ఒకరు ఇటుక రాయిలతో దాడి చేసుకున్నారు. ఆ సమయంలో ఇటుక రాయిలు కుంచె కృపమ్మ మీద పడి రక్తం గాయాలయ్యాయి. ఆమెను రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా గంటి చిన్నకుమారి బావగారి కుమారుడు గంటి గంగరాజును కొవ్వూరు కృష్ణ వర్గీయులు హేళన చేశారన్నారు. దీన్ని గమనించిన చిన్నకుమారి, ఆమె తోటి కోడలు గంటి వేణిలు ఎందుకు హేళన చేస్తున్నారని కృష్ణ వర్గీయులను అడిగారన్నారు. రాత్రి 11 గంటలకు కృష్ణ, అతని వర్గీయులు చిన్నకుమారిపై గొడవకు వచ్చి, వారితో తెచ్చుకున్న ఇటుక రాయిలను చిన్నకుమారి, ఆమె వర్గీయులపై విసిరారన్నారు. చిన్నకుమారికి రక్తపు గాయాలు కావడంతో వైద్యం కోసం రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి వేణు

కె.గంగవరం: మండల పరిధిలోని పామర్రు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దడాల సూర్యనారాయణ(40) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ సూర్యనారాయణ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాదే కపిల్, వాసంశెట్టి సూరిబాబు, పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీను తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

అండగా ఉంటామని భరోసా

రామచంద్రపురం రూరల్: మండలంలోని మట్లచెరువు గ్రామానికి చెందిన కడియాల ఆనందరావు(పండు) ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చిట్టియ్యదొర కుటుంబీకులకు..

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రుకు చెందిన స్థానిక పీఏసీఎస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల రైతు విభాగం అధ్యక్షుడు రేమళ్ళ చిట్టియ్యదొర కుటుంబీకులకు సోమవారం రాత్రి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ పరామర్శించారు. చిట్టియ్యదొర మనుమడు గంగవల్లి నాగసాయి(25) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ దంగేటి అరుణ్‌కుమార్, కుయ్యేరు గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి రేమళ్ళ చిట్టియ్యదొరను పరామర్శించిన వారిలో ఉన్నారు.